సాక్షి విజయనగరం

శనివారం । 18 । మార్చి । 2023



'తల్లీబిడ్డ' సురక్షితం

మాతాశిశు సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. బాలింతలకు రూపాయి ఖర్చులేకుండా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లలో ఆస్పత్రి నుంచి క్షేమంగా ఇంటికి చేర్చుతోంది. - IIలో



ఫిష్ ఆంధ్రా -ఫిట్ ఆంధ్రా ప్రాజెక్టుకు అదనపు సబ్సిడీ

ఫిష్ ఆంధ్రా - ఫిట్ ఆంధ్రా ప్రాజెక్టుకు అదనపు సబ్సిడీని మంజూరు చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య అన్నారు. - IIలో



30 ఎకరాల్లో కొండపోడు పంటలు దగ్ధం

కొండపోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనుల పంటలు దగ్ధమయ్యాయి. రైతులు ఆందోళన చెందుతున్నారు. - IIలో

న్యూస్‌రీల్

జిల్లాకు చేరిన ఎంసీహెచ్ కార్డులు



ఎంసీహెచ్ కార్డులను దించుతున్న సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: గర్భిణుల వివరాలు నమోదు చేసే ఎంసీహెచ్ (మదర్ చైల్డ్ హెల్త్) కార్డులు 26 వేలు జిల్లాకు శుక్రవారం చేరాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని స్టోర్‌లో వీటిని భద్రపరిచారు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని పీహెచ్‌సీలకు సరఫరా చేస్తారు. ఎంసీహెచ్ కార్డులో గర్భిణుల వైద్య తనిఖీ వివరాలు నమోదు చేస్తారు. ఏ నెలలో ఏ టీకా వేయాలన్న వివరాలు ఉంటాయి.

19న మహిళల సీనియర్స్ కబడ్డీ జట్టు ఎంపిక

విజయనగరం: జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే ఏపీ సీనియర్స్ మహిళా జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 19న గుంటూరులోని బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్టు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 కిలోల లోపు బరువు కలిగిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆ రోజు రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు హర్యానాలో జరగనున్న జాతీయస్థాయి సీనియర్స్ మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.


తాటిచెట్టుపై పిడుగు



పిడుగుపాటుకు తాటిచెట్టుపై మంటలు

బొండపల్లి: బోడసింగిపేట గ్రామ పరిధి ఏఎమ్‌సీ గొడౌన్‌కు సమీపంలో తాటిచెట్టుపై శుక్రవారం పిడుగు పడింది. దీనిని చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్



గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరంఫూల్‌బాగ్/గుర్ల: గుర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఎ. సూర్యకుమారి శుక్రవారం తనిఖీచేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 25,274 మంది విద్యార్థులు హాజరుకాగా, 1780 మంది గైర్హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఐదుగురు విద్యార్థులను డీబార్ చేశారు.

ఏప్రిల్ నెలాఖరుకు బీసీసెల్ కమిటీలు

దత్తిరాజేరు: జిల్లా వ్యాప్తంగా బీసీసెల్ మండల, గ్రామ కమిటీలు ఏర్పాటుచేయాలని ప్రభుత్వ విప్, రాష్ట్ర బీసీ సంఘాల చైర్మన్ జంగా కృష్ణమూర్తి సూచించారని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య సూచనల మేరకు త్వరలో కమిటీలు నియమిస్తామని శుక్రవారం చెప్పారు.

అకాల వర్షంతో అరటికి నష్టం



బొడ్డవర ప్రాంతంలో పాడైన అరటితోట

శృంగవరపుకోట: అకాల వర్షంతో అరటి రైతులకు నష్టం వాటిల్లింది. మండలంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులకు పలు గ్రామాల్లో అరటి తోటలు, మొక్కజొన్న చేలు నేలకొరిగాయి. పంట చేతికొచ్చే సమయంలో పాడవ్వడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

● చిరుధాన్యాలతో 'సాగు'దాం



నవధాన్యాలతో పుడమితల్లిని సారవంతం చేసి.. చిరుధాన్యాలు పండించి అధిక లాభాలు ఆర్జించాలంటూ రైతులకు వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పిలుపునిచ్చారు. ఊరూరా చిరుధాన్యాల మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. చిరుధాన్యాల సాగు పద్ధతులు, కలిగే ప్రయోజనాలు, మార్కెట్‌లో డిమాండ్‌పై అవగాహన కల్పించారు. భోగాపురంలో చిరుధాన్యాల సాగుపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్న, ఎఫ్‌పీఓ సమాఖ్య సంఘ మహిళలు, ఏఓ ఎం.సూరినాయుడు, ఏపీఎం వై.రమణ తదితరులు పాల్గొన్నారు. - భోగాపురం

● ముందస్తు జాగ్రత్త..!

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో విజయనగరం జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయి. పొలాల్లో ఉన్న ధాన్యం, నువ్వు తదితర వ్యవసాయ పంటలు తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పుతున్నారు. ధర్మపురి గ్రామ సమీపంలో కనిపించిన ఈ చిత్రం రైతుల ముందస్తు జాగ్రత్తకు నిదర్శనం. - సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



● వైభవంగా శ్రీనివాసుని కల్యాణం





రాజాం మండలం అంతకాపల్లి గ్రామంలో పద్మావతి గోదాసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. ముందుగా టీటీడీకు చెందిన వేదపండితులు మహాసుదర్శన హోమం జరిపారు. సాయంత్రం నిర్వహించిన కల్యాణోత్సవంలో చిన్నారుల కోలాటం భక్తులను అలరించింది. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జీఎంఆర్ సోదరులతో పాటు వందలాది మంది భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. - రాజాంసిటీ

మహిళల జీవన ఉన్నతికి..

స్త్రీనిధి



- గరిష్టంగా ఒక్కో సభ్యురాలికి రూ.లక్ష రుణం
- దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే రుణం మంజూరు
- నాలుగేళ్లలో 1,27,176 మందికి రుణాలు మంజూరు
- వివిధ యూనిట్లతో జీవన ఉన్నతి



స్త్రీనిధి రుణ లక్ష్యాలపై తెర్లాంలో అవగాహన కలిగిస్తున్న ఏజీఎం ఉమామహేశ్వరరావు (ఫైల్)

విజయనగరం అర్బన్: మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. పొదుపు సంఘాల మహిళలకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సమన్వయంతో స్త్రీ నిధి రుణాలను మంజూరుచేస్తోంది. జీవనోపాధి యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక తోడ్పాటునందిస్తోంది. ఒకవైపు బ్యాంకు లింకేజీ రుణ సదుపాయం కల్పిస్తూనే స్త్రీనిధి రుణం గరిష్టంగా ఒక్కొక్కరికీ రూ.లక్ష వరకు మంజూరు చేస్తోంది. 24 నెలల వాయిదా ప్రాతిపదికన స్వల్ప వడ్డీతో రుణాలు మంజూరు చేస్తోంది.

1,27,176 మందికి రుణాలు

2019-20 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు నాలుగేళ్లలో స్త్రీనిధి ద్వారా 1,27,176 మందికి రూ. 555.01 కోట్ల రుణ సహకారం అందింది. వ్యవసాయ ఆధారిత యూనిట్లు, వంటకాలు, కిరాణా దుకాణాలు తదితర యూనిట్ల ఏర్పాటుతో మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారు. దీంతో నాలుగేళ్లుగా రుణ రికవరీ శతశాతం నమోదైంది.

దరఖాస్తు చేసిన గంటల్లోనూ....

జీవనోపాధి రుణం కోసం సభ్యురాలు అర్జీ పెట్టుకున్న 48 గంటలల్లో రుణం మంజూరవుతుంది. రుణం కోసం పొదుపు సభ్యులు స్త్రీనిధి కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. రుణం కావాలనుకునే మహిళ తమ సంఘ సమావేశంలో దరఖాస్తు చేసుకుంటే చాలు. యానిమేటర్ వచ్చి బయోమెట్రిక్ ద్వారా సభ్యురాలి వేలిముద్ర తీసుకుంటారు. సొమ్ము నేరుగా సభ్యురాలి సంఘ ఖాతాలో జమవుతుంది. సంఘ సమావేశంలో లీడర్ తీర్మానం చేసి సభ్యురాలి ఖాతాకు రుణ మొత్తాన్ని పంపిస్తారు. స్త్రీనిధి ద్వారా రుణం పొందేందుకు ప్రాసెసింగ్ ఫీజు, దరఖాస్తు రుసుం, జీఎస్టీ ఉండవు.



ఈ చిత్రంలో కార్పెంటర్ షాప్‌ను నిర్వహిస్తున్న సభ్యురాలి పేరు గుండేమల్ల ధనలక్ష్మి. కొత్తవలస మండలం కేంద్రంలోని తుమ్మికాపల్లిలో నివసిస్తోంది. ఆమె శ్రీగణపతి ఎంపీఎస్ సంఘంలో సభ్యురాలు. స్త్రీనిధి ద్వారా రూ.50 వేలు రుణం పొందింది. భర్త సాయంతో కార్పెంటర్ వృత్తి చేస్తోంది. మరోవైపు బ్యాంకు లింకేజీ కింద ఐదుసార్లు రుణం తీసుకుని యూనిట్‌ను విస్తరింపజేసింది. షాపు నిర్వహణతో వస్తున్న ఆదాయం నుంచి నెలసరి వాయిదాలు చెల్లిస్తూ తన వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటోంది.

స్త్రీనిధి రుణ నిబంధనలు, లక్ష్యాలు..

- ప్రతి గ్రామ సంఘానికి స్త్రీనిధి ద్వారా లబ్ధి చేకూరుతుంది.
- స్త్రీనిధి రుణానికి సురక్ష పథకం ద్వారా పూర్తి రుణ రక్షణ ఉంటుంది.
- ఎలాంటి చార్జీలు లేకుండా సులభంగా రుణం మంజూరు అవుతుంది.
- అర్హత ఉన్న పొదుపు సంఘంలో ఆరుగురికి రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం కలుగుతుంది. వాయిదాల పద్ధతిలో తిరిగి రుణం చెల్లించాలి.



చిత్రంలో మామిడి తాండ్ర, మామిడి జెల్ యూనిట్లు నిర్వహిస్తున్న మహిళ పేరు కాకర్లపూడి భారతి. స్వగ్రామం ఎల్.కోట మండలంలోని భీమాలి. ఆమె భవానీ ఎంపీఎస్ పొదుపు సంఘంలో సభ్యురాలు. స్త్రీనిధి నుంచి తీసుకున్న రూ.50 వేలు రుణంతో భర్త సాయంతో మామిడి ఉత్పత్తుల తయారీ యూనిట్ నిర్వహిస్తోంది. తద్వారా వచ్చే ఆదాయం నుంచి నెల సరివాయిదాలు చెల్లిస్తూ తన వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతోంది.

2022-23 స్త్రీనిధి రుణ (రూ.కోట్లు) లక్ష్యాలు (నియోజకవర్గాల వారీగా)

నియోజకవర్గం	సభ్యులు	ఇచ్చిన రుణం
బొబ్బిలి	4,099	21.63
చీపురుపల్లి	6,905	33.58
గజపతినగరం	6,818	29.78
నెల్లిమర్ల	7,759	33.24
రాజాం	5,831	30.14
సాలూరు	273	0.94
ఎస్.కోట	9,285	38.28
విజయనగరం	1,388	6.34
మొత్తం	42,358	193.93

మూడేళ్లలో స్త్రీనిధి రుణ నిధులు మంజూరు ఇలా...

ఆర్థిక సంవత్సరం	రుణం పొందిన సభ్యులు	రుణం (రూ.కోట్లు)
2019-20	21,841	107.38
2020-21	20,016	101.14
2021-22	42,961	152.56
2022-23	42,358	193.93
మొత్తం	1,27,176	555.01

తక్షణమే రుణం మంజూరు



అర్హత ఉన్న సభ్యురాలు రుణం కోసం అర్జీ పెట్టుకున్న 48 గంటల్లో మంజూరు చేస్తాం. రుణం పొందేందుకు ప్రాసెసింగ్ ఫీజు, దరఖాస్తు రుసుం, జీఎస్టీ ఉండదు. ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యం. మూడు ఆర్థిక సంవత్సరాల్లో 84 వేల మంది పొదుపు మహిళలకు రుణం మంజూరు చేశాం. రుణ రికవరీ శతశాతం నమోదైంది. రుణం పొందిన వారు వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నారు.

- ఎ.కళ్యాణచక్రవర్తి, పీడీ, డీఆర్‌డీఏ

రాములోరికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి బొత్స

నెల్లిమర్ల రూరల్: శ్రీరామనవమిని పురస్కరించుకొని ఈ నెల 30న రామతీర్థంలో అధికార లాంఛనాలతో జరగబోయే సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు దేవదాయ, ధర్మాదాయశాఖ రాష్ట్ర కమిషనర్ హరి జవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారని దేవస్థానం ఈఓ ప్రసాదరావు తెలిపారు. సింహాచలం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలను రామస్వామి కల్యాణానికి మంత్రి బొత్స సత్యనారాయణ సమర్పిస్తారని చెప్పారు.

20న సమీక్ష సమావేశం

శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణపై ఈ నెల 20న రామతీర్థంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఈఓ ప్రసాదరావు తెలిపారు. 30న అధికార లాంఛనాలతో జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవంలో భాగంగా ముందస్తు ఏర్పాట్లపై ఆర్డీఓ సూర్యకళ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమీక్షిస్తామని చెప్పారు.

పోలీస్ వెల్ఫేర్‌డే



పోలీస్‌సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం పోలీస్ వెల్ఫేర్‌డే నిర్వహించారు. సిబ్బంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలను తెలుసుకున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

దుర్గమ్మా.. చల్లంగ చూడమ్మా..



కోటదుర్గతల్లి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న దంపతులు

తల్లీ జగన్మాతా.. నమోనమామి... దుర్గమ్మా.. మమ్మల్ని చల్లంగ చూడమ్మా.... ఆది పరాశక్తి ఆదుకోవమ్మా అన్న శరణుఘోషతో వీరఘట్టం మారుమోగింది. కోటదుర్గమ్మకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ పునఃప్రారంభోత్సవంలో భాగంగా యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో శుక్రవారం 250 మంది దంపతులు అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. సహస్రనామార్చనలు, నారికేళాలతో గోపుర శిఖరంలో అలంకరించబోయే కళశానికి అభిషేకాలు చేశారు. - వీరఘట్టం

దుర్గమ్మ సేవలో మంత్రి బొత్స కుటుంబం



మంత్రి బొత్స సత్యనారాయణకు అమ్మవారి ప్రసాదాలు అందజేస్తున్న ఈఓ భ్రమరాంబ, అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబ సమేతంగా శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన మంత్రి బొత్స సత్యనారాయణకు ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈఓ భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు.

రైల్వేలైన్ పనుల పరిశీలన




రైల్వే మూడో లైన్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణ రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న మూడో లైన్ పనులను సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఇ.వి.గురునాథరావుతో కలిసి కలెక్టర్ నిషాంత్‌కుమార్ శుక్ర వారం పరిశీలించారు. విజయనగరం-టిట్లఘర్ మధ్య నిర్మిస్తున్న రైల్వే మూడో లైన్ పనులు 265 కిలోమీటర్లమేర రూ.2335.68 కోట్లతో చేపట్టినట్టు గురునాథరావు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 44 కిలోమీటర్ల మేర లైన్ వేస్తున్నామన్నారు. ఇందులో మేజర్ బ్రిడ్జిలు మూడు, ఆరు ఆర్‌యూబీలు, 135 మైనర్ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కూనేరు నుంచి సీతానగరం వరకు పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. పార్వతీపురంలో అదనపు కాలినడక వంతెన, బుకింగ్ కార్యాలయం, కూనేరు, గుమడ, పార్వతీపుం, సీతానగరంలలో మెరుగైన సౌకర్యాలతో కొత్త స్టేషన్ భవనాలు నిర్మిస్తామని చెప్పారు.

పశు ఆరోగ్యంపై జాగ్రత్త

- రాయితీపై గడ్డివిత్తనాల సరఫరా
- జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ వై.వి.రమణ



రికార్డులను తనిఖీచేస్తున్న డాక్టర్ వై.వి.రమణ

నెల్లిమర్ల: ప్రస్తుత వేసవి కాలంలో పశువుల ఆరోగ్యంపై రైతులందరూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వై.వి. రమణ సూచించారు. పట్టణంలోని పశువైద్యశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. స్థానిక ల్యాబ్‌లో సౌకర్యాలపై ఏడీ డాక్టర్ చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వేసిన గాలికుంటువ్యాధి నివారణ టీకాలపై ఆరా తీశారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో పాడి రైతులంతా తమ పశువులు, జీవాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆవులు, గేదెలకు ప్రతిరోజూ 60 నుంచి 70 లీటర్ల వరకు తాగునీటిని అందించాలన్నారు. ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 5 తర్వాత మాత్రమే మేతకు బయటకు తీసుకెళ్లాలన్నారు. జిల్లాలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రమణ తెలిపారు. రూ.460 విలువైన 5 కిలోల విత్తనాల ప్యాకెట్ రూ.115కే అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 21 టన్నుల విత్తనాలను రైతులకు అందజేశామని, మరో 15 టన్నులు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. గాలికుంటు వ్యాధి సోకకుండా జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1వ తేదీ నుంచి టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభించామన్నారు. మొత్తం 4.23 లక్షల డోసులు లక్ష్యం కాగా ఇప్పటివరకు 2.1 లక్షల డోసులు వేశామన్నారు. ఈ నెలాఖరుకు లక్ష్యం పూర్తిచేస్తామని చెప్పారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడులు నిర్వహిస్తామని తెలిపారు. రైతులంతా ఆయా ఆర్బీకేల్లో నిర్వహించే తరగతులను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

గేట్ ఫలితాల్లో విజయ్ సత్తా


గేట్‌లో 11వ ర్యాంక్ సాధించిన విజయ్

లక్కవరపుకోట: గేట్ ఫలితాల్లో మండలంలోని రంగారాయపురం గ్రామానికి చెందిన బొడుమూరు విజయ్ జాతీయ స్థాయిలో 11వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. గురువారం ఈ ఫలితాలు విడుదలయ్యాయి. విజయ్ తండ్రి రమణ గ్రామంలో దర్జీగా పనులు చేస్తూ కుటుంబ పోషణ చేస్తున్నాడు. తల్లి మనమ్మ గృహిణి. విజయ్ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు లక్కవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్, ఇంజినీరింగ్ విద్య నూజివీడు ట్రిపుల్ ఐటీలో చదివాడు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(హైదరాబాద్‌లో)లో టెక్నికల్ అధికారిగా పని చేస్తున్నాడు. విజయ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల డీబార్

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస బాలుర గురుకుల కళాశాలలో ఇద్దరు ఇంటర్మీడియెట్ విద్యార్థులు శుక్రవారం డీబార్ అయినట్టు ప్రిన్సిపాల్ అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులు డీబారయ్యారని తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

వ్యక్తి అరెస్టు


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో సీఐ తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని ఎరుకుల వీధికి చెందిన పిరిడి శంకరరావు అనే వ్యక్తి ఆ ప్రాంతంలో మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ విలేకర్లకు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన దాడుల్లో నిందితుని నుంచి 42 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం తరలించామన్నారు. దాడుల్లో హెచ్‌సీ మాధవి, చంద్రప్రసాద్, జయరామ్, సరస్వతి తదితరులు పాల్గొన్నట్టు సీఐ తెలిపారు.

ఒకరి మృతి

దత్తిరాజేరు: మండలంలోని ఎం.లింగాలవలసలో కడుపునొప్పి తాళలేక మంత్రి కృష్ణమూర్తి మృతి చెందినట్టు పెదమానాపురం ఎస్‌ఐ బి.భాగ్యం శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. కృష్ణమూర్తి మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఇంటికి రాకపోవడంతో ఎదురు చూస్తున్న సమయంలో సాయంత్రం ఇంటి వెనుక పడి ఉండడం గమనించిన కుటుంబ సభ్యులు సపర్యలు చేయగా ఉలుకు, పలుకు లేకపోవడంతో వెంటనే 108లో గజపతినగరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు గజపతినగరం సామాజిక ఆస్పత్రిలో వైద్యం పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య గౌరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య మంత్రి గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

'తల్లీబిడ్డ' సురక్షితం



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 38 వాహనాలు
- ఇప్పటి వరకు 10 వేల మందికి సేవలు
- పైసా ఖర్చు లేకుండా ఉచితంగా ఇంటికి చేర్చుతున్న వైనం


బిడ్డతో ఇంటికి వెళ్తున్న మహిళ

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు గర్భిణులు, బాలింతల పాలిట వరంగా మారాయి. పురిటి నొప్పులు రాగానే సమాచారం వచ్చిందంటే చాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్చి ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా, హ్యాపీగా ఇంటికి చేర్చుతున్నారు. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

విజయనగరం ఫోర్ట్: మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. గర్భిణులను ఆస్పత్రికి ప్రసవం కోసం చేర్చడానికి 108 అంబులెన్సులను ప్రవేశపెట్టింది. ప్రసవం తర్వాత తల్లీబిడ్డలను ఇంటికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్సుల ద్వారా ఉచితంగా చేర్చుతున్నారు. గర్భిణులను ఆస్పత్రికి ఉచితంగా తీసుకువెళ్లడంతో పాటు ప్రసవం అనంతరం ఇంటికి కూడా ఉచితంగా ఈ వాహనం ద్వారా ప్రభుత్వమే చేర్చుతుంది.

విజయనగరం జిల్లాలో 22 వాహనాలు

తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి ఉచితంగా చేర్చుతుండడంతో ప్రసవించిన ప్రతి ఒక్కరు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. ఏసీ సౌకర్యంతో కూడిన వాహనం కావడంతో తల్లీబిడ్డ ఇద్దరికి సౌకర్యవంతంగా ఉంటుంది.

గతంలో ఒకే వాహనంలో ఇద్దరు, ముగ్గురు లబ్ధిదారులను వాహనాల్లో ఇంటికి చేర్చేవారు. ప్రస్తుతం ఒకే వాహనంలో ఒక తల్లీబిడ్డను మాత్రమే ఇంటికి చేర్చుతున్నారు. జిల్లాలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు 22 ఉన్నాయి. 2022 ఏప్రిల్ నుంచి ఇంత వరకు 6వేల మంది వరకు తల్లీబిడ్డలను ఇంటికి చేర్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు 16 ఉన్నాయి. ఇంతవరకు నాలుగు వేల మంది వరకు ఇంటికి చేర్చారు.

యాప్‌లో గర్భిణుల వివరాలు

గర్భిణులు కాన్పు కోసం ఆస్పత్రికి వెళ్లిన నాటి నుంచి డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం యాప్‌లో నమోదు చేస్తారు. తల్లుల రక్షణ, భద్రతకు భరోసా కల్పిస్తూ వాహనాలకు జీపీఎస్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేస్తూ వాహనం ఎక్కడ ఉందో కూడా అధికారులు రియల్ టైంలో తెలుసుకునేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలకు టోల్‌ఫ్రీ నంబరు 102 కేటాయించారు.

జిల్లాకు కేటాయించిన వాహనాల వివరాలు

ఘోషాస్పత్రికి 9 వాహనాలు, పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి 4 వాహనాలు, సాలూరు సీహెచ్‌సీకి 2, చీపురుపల్లికి 2, బొబ్బిలి సీహెచ్‌సీకి 2, గజపతినగరం సీహెచ్‌సీ, నెల్లిమర్ల సీహెచ్‌సీ, బాడంగి సీహెచ్‌సీ, గురునాయుడుపేట పీహెచ్‌సీ, కురుపాం సీహెచ్‌సీ, భద్రగిరి సీహెచ్‌సీ, రామభద్రపురం పీహెచ్‌సీ, బందలుప్పి పీహెచ్‌సీ, మక్కువ పీహెచ్‌సీ, ఎస్.కోట సీహెచ్‌సీ, ఎల్.కోట పీహెచ్‌సీ, డెంకాడ పీహెచ్‌సీ, మొండెంఖల్లు పీహెచ్‌సీ, భోగాపురం సీహెచ్‌సీలకు ఒకొక్కటి చొప్పున కేటాయించారు.

సంతోషంగా ఉంది



నాకు పురిటినొప్పులు రాగానే 108లో ఆస్పత్రికి చేర్చారు. ఘోషాస్పత్రిలో ప్రసవించిన తర్వాత తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఉచితంగా ఇంటికి చేర్చారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచితంగా ప్రసవం జరగడంతో పాటు ఎటువంటి రవాణ చార్జీలు లేకుండా ఇంటికి చేరుకోవడం చాలా సంతోషంగా ఉంది. – కె.కామయ్యమ్మ, జక్కువ గ్రామం, మెంటాడ మండలం

సురక్షితంగా ఇంటికి...

జిల్లాలో 22 వాహనాల ద్వారా తల్లీబిడ్డలను ఇంటికి చేర్చుతున్నాం. ఆస్పత్రిలో డిశ్చార్జ్ అయిందని సమాచారం వచ్చిన వెంటనే వారిని స్వగ్రామాలకు చేర్చుతున్నాం. ఉచితంగా ఇంటికి వెళ్లడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
– రవి, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కో – ఆర్డినేటర్

ఫిష్ ఆంధ్రా - ఫిట్ ఆంధ్రా ప్రాజెక్టుకు అదనపు సబ్సిడీ


సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

- జిల్లా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య

పార్వతీపురం: ఫిష్ ఆంధ్రా - ఫిట్ ఆంధ్రా ప్రాజెక్టుకు అదనపు సబ్సిడీని మంజూరు చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ ఏజెన్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిష్ ఆంధ్రా లబ్ధిదారుల ఎంపిక, షాపు ఎంపిక, డీసీసీబీ బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. జనరల్ కేటగిరీలో 40శాతం సబ్సిడీ మహిళలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరిలో 60శాతం సబ్సిడీని మంజూరు చేయనున్నట్లు తెలిపారు. శ్రీనిధి ఫండ్స్ ద్వారా డీఆర్‌డీఏ ఆర్థిక సహాయం చేసేందుకు చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఫుట్ ప్రాసెసింగ్ ద్వారా 39శాతం సబ్సిడీ అందజేస్తామన్నారు. మినీ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్స్ యూనిట్‌కి లక్ష నుండి 3లక్షల వరకు ఉండగా లబ్ధిదారుల వాటా 10శాతం చెల్లించాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ష్యూరిటీ లేకుండా రుణ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. రూ.10లక్షలు, రూ.20లక్షల కోబ్రాండింగ్, డీఎఫ్ఎఫ్, ఫిష్ ఆంధ్రా డైలీ డెలిషియస్ సూపర్, ఫిష్ కియోస్క్, లైవ్‌ఫిష్ వెండింగ్ సెంటర్ యూనిట్స్‌కు 40నుండి 60శాతం వరకు సబ్సిడీ, రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఔత్సాహిక నిరుద్యోగ యువకులు ఎస్‌హెచ్‌జీ, ఎన్‌జీఓలు వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు మత్స్య శాఖ జిల్లా అధికారి 9701463640ను సంప్రదించాలన్నారు. పాలకొండ/భద్రగిరి మత్స్య శాఖాధికారి 9441279251ను, పార్వతీపురం/ సాలూరు ఎఫ్‌డీఓ 8309206895, స్థానిక సచివాలయం గ్రామ మత్స్యసహాయకులను సంప్రదించాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎస్ మూర్తి, టీపీఎంయూ అదనపు పథక సంచాలకులు వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ప్రారంభమైన సింపోజియం


మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ కె.వెంకట సుబ్బయ్య

విజయనగరం టౌన్: జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటూ నిర్వహిస్తున్న నేషనల్ లెవెల్ టెక్నికల్ సింపోజియం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఇటువంటి సింపోజియంలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతీ విద్యార్థి మల్టీ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమలో ఉన్న నాలెడ్జ్‌ను అభివృద్ధి పరుచుకోవాలన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ప్రొఫెసర్ జెవిఆర్.మూర్తి మాట్లాడుతూ ప్రపంచమంతా భారతీయ యువత వైపే చూస్తోందన్నారు. అందుకనుగుణంగా ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి తమ అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్ మాట్లాడుతూ కొత్త ఆలోచనలతో కొత్త అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ సిహెచ్.హిమబిందు, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు కె.వెంకటరమణ, ఎస్.ప్రమీల, ప్రొఫెసర్‌లు బాబులు, రాజ్యలక్ష్మి, జయసుమ, జి.అప్పలనాయుడు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ఆరా..


విక్రంపురం సబ్ సెంటర్‌లో గర్భిణులకు మాత్రలు వేయిస్తున్న డీఐఓ జగన్‌మోహనరావు

కొమరాడ: గ్రామాల్లోని గర్భిణుల ఆరోగ్యంపై పర్యవేక్షణ చేసి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని విక్రంపురం గ్రామ సబ్ సెంటర్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీవార్మింగ్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా రెండు, మూడు త్రైమాసికంగా ఉన్న గర్భిణులకు వైద్యారోగ్య శాఖ సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రం వేస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో గర్భిణులకు ఈ మాత్రలు వేయించారు. పీహెచ్ఎన్ విజయగౌరి, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

30 ఎకరాల్లో కొండపోడు పంటలు దగ్ధం

- కాలిపోయిన జీడి, పసుపు, పైనాపిల్ మొక్కలు
- గిరిజనులకు భారీ నష్టం


బొర్రవలస కొండల్లో కాలిన పంటలను పరిశీలిస్తున్న కిండంగి సచివాలయ సిబ్బంది

సీతంపేట: కొండపోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనుల పంటలు దగ్ధమయ్యాయి. దీంతో రైతులంతా ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కోడిశ, శంబాం పంచాయతీ పరిధి బొర్రవలస కొండ వద్ద జరిగిన అగ్ని ప్రమాదం వలన సుదూర ప్రాంతంలో ఉన్న ఆడలి, బొక్కుడుగూడ, బొర్రవలస గ్రామాలకు చెందిన రైతుల పంటలు కూడా కాలిపోయాయి. బుధవారం మధ్యాహ్నం రాజుకున్న మంటలను ఆపడం ఎవ్వరితరం కాలేదని గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో మంటలు ఆగాయని గిరిజనులు తెలిపారు. కొండపోడు పంటలైన జీడి, మామిడితో పాటు అంతర్ పంటలైన పసుపు, పైనాపిల్, అల్లం, కొండచీపుర్లు పూర్తిగా బుగ్గిపాలయ్యాయని గిరిజన రైతులు లబోదిబోమంటున్నారు. బొర్రవలసకు చెందిన ఓ రైతు తన పొలంలో తుప్పలు కాల్చేసి అగ్గి ఆపకుండా వెళ్లడంతో ఇలా జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కిండంగి గ్రామ సచివాలయ సిబ్బంది వీఆర్ఓ మహేష్, గ్రామ కార్యదర్శి రవీంద్ర, వీఆర్‌ఏ సూర్యనారాయణ, మహిళా పోలీస్ అరుణ వెళ్లి పరిశీలించారు. నివేదికను తహసీల్దార్‌కు సమర్పించామన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹ 180

పక్షి ప్రేమికులు

వేసవిలో పక్షులు, మూగజీవాలు, మొక్కలకు నీరు, ఆహారాన్ని అందిస్తూ కొందరు ఉపాధ్యాయులు తమ సేవా దృక్పథాన్ని చాటుకుంటున్నారు. నలుగురికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అభిమాని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రెడ్డి రాజగోపాలరావు, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కె.విజయగౌరి, కృష్ణాపురానికి చెందిన శ్రీచైతన్య యువజన సేవా సంఘం అధ్యక్షుడు చుక్క శ్రీనివాసరావు, మెట్టవలసకు చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి కాజా వేణుగోపాలరావు, ఉపాధ్యాయుడు కె.కృష్ణదాస్ పక్షులకు చెట్లపై బాటిళ్లతో నీరు నింపుతూ వాటి దాహార్తిని, ఆహారం పెడుతూ ఆకలిని తీర్చుతున్నారు. మొక్కలను సంరక్షిస్తున్నారు. ఇదే సమయంలో వీటి సంరక్షణ అవసరాన్ని ప్రచారం చేస్తూ నలుగురిని ఆలోచింపజేస్తున్నారు.
– బొబ్బిలి రూరల్


ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పక్షులకు చలివేంద్రం సిద్ధం చేసిన ఉపాధ్యాయులు



వేసవిలో పక్షుల కోసం ఆహారం అందించేందుకు కృష్ణాపురంలో శ్రీనివాసరావు ఏర్పాటు చేస్తున్న ట్రేలు


చెట్టుపై పక్షుల కోసం ట్రే ఏర్పాటు చేస్తున్న కృష్ణదాస్


మెట్టవలసలో పక్షులకు నీటిని ఏర్పాటు చేస్తున్న విశ్రాంత బ్యాంకు ఉద్యోగి కాజా వేణుగోపాలరావు


పక్షుల కోసం ఆహారం అందించే పరికరం ఏర్పాటు చేస్తున్న అభిమాని ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజగోపాలనాయుడు